క్లుప్తంగా

విద్యార్థినికి ఆర్థిక సాయం



పిడుగురాళ్ల: విద్యార్థిని చదువు కోసం సత్య సాయి బాబా ట్రస్టు సభ్యులు ఆర్థిక సాయం గురువారం అందజేశారు. పట్టణానికి చెందిన గ్రంధి కీర్తి నర్సరావుపేటలోని ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. విద్యార్థిని రెండవ సెమిస్టర్ కోసం ట్రస్టు సభ్యులు ఉడతా వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం సతీమణి రత్నమాల రూ.10 వేలు అందజేసినట్లు మందిరం కన్వీనర్ గర్రె నాగేశ్వరరావు తెలిపారు.

షిర్డి సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): మండల పరిధిలోని పాలువాయి జంక్షన్ వద్ద నున్న షిర్డి సాయి బాబా ఆలయంలో గురువారం ఆలయ అర్చకులు గోపాల్ పాండే ఆధ్వర్యంలో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఎంతో మహిమ కలిగిన షిర్డి సాయిబాబాని పూజిస్తే కోరికలు నెరవేరుతాయనే భావంతో పల్నాడు ప్రాంతంలోని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని, సాయినాథునికి తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఆలయ ఆవరణలో భజన బృందం సభ్యులు బాబా గీతాలను ఆలపించారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ చైర్మన్ పందిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్నదానం, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

సర్వే నిబద్ధతతో నిర్వహించాలి

మాచర్ల: సచివాలయ అడ్మిన్లు, ఉద్యోగులు, డ్వాక్రా సంఘాలు సామాజిక సర్వే కార్యక్రమంలో కీలక పాత్ర వహించాలని మున్సిపల్ కమిషనర్ వేణుబాబు కోరారు. గురువారం మెప్మా ప్రాజెక్టు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా సంఘాల సభ్యులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రజలకు అవసరమైన విషయాలు కనుక్కొని తన దృష్టికి తీసుకు రావాలన్నారు. ఎవరూ నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఆయా వార్డుల్లో డ్వాక్రా ఆర్పీలు సమావేశాల్లో సర్వేకు సంబంధించిన వివరాలు, పరిశుభ్రత, తీసుకోవాల్సిన చర్యలు, ఆరోగ్య తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి కిరణ్‌కుమార్ నాయక్, బాలు నాయక్, సీడీపీఓ, పీఓలు, పలువురు పాల్గొన్నారు.

పల్నాడు కిడ్స్ ప్యాషన్ వాక్ సీజన్ 2

పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో గల ఆక్స్‌ఫర్డ్ స్కూల్ సమీపంలో ఉన్న పల్నాడు ఓయాసిస్‌లో పల్నాడు కిడ్స్ ఫ్యాషన్ వాక్ సీజన్ 2ను నిర్వహించనున్నట్లు ఓయాసిస్ నిర్వాహకులు, డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఓయాసిస్‌లో విలేకరుల సమావేశం ఆయన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...పల్నాడు కిడ్స్ ఫ్యాషన్ వాక్‌కు గతంలో అపూర్వ స్పందన వచ్చిందని గుర్తుచేశారు. అదే తరహాలో సీజన్ 2ని కూడా ఆహ్లాదంగా, ఆనందంగా నిర్వహించబోతున్నామని చెప్పారు. ఈ నెల 13వ వరకు చిన్నారులకు కేవలం వంద రూపాయల రిజిస్ట్రేషన్ చార్జిలతో కార్యక్రమంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ స్కూలు విద్యార్థులకు రిజిస్ట్రేషన్ ఉచితమని చెప్పారు. జూనియర్ కేటగిరి ఏడు సంవత్సరాల వరకు, సీనియర్ కేటగిరిలో 7 నుంచి 14 సంవత్సరాల వరకు చిన్నారులు పాల్గొనవచ్చన్నారు. మొదటి, రెండవ, మూడవ బహుమతులు రూ.5 వేలు, రూ. 3 వేలు, 2 వేలు ప్రైజ్ మనీ ఉంటుందన్నారు. మరన్ని వివరాలకు 94181 8666 నంబర్‌ను సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

జీవో 58ను అమలు చేయాలి

సత్తెనపల్లి: కుల ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు కలుగుతున్న ఇబ్బందుల తొలగింపుకు జీవో 58ని అమలు చేయాలని ప్రగతి మాదిగ దాసు సంక్షేమ సేవా సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంకాళ్ల నాగరాజు కోరారు. గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్‌గనోరేను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా మాదిగ దాసులు కుల ధ్రువీకరణ పత్రాలు ఆర్డీవో కార్యాలయం నుంచి పొందుతున్నామని, దీంతో కాలయాపన జరిగి సకాలంలో ప్రభుత్వ రాయితీలు పొందలేక పోయామన్నారు. ఈ ఇబ్బందులను అర్థం చేసుకొని గత ప్రభుత్వం జీవో 58 విడుదల చేసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి తీసుకునేలా సవరణ చేసిందన్నారు. కాగా ఈ జీవోను అమలు చేయకుండా తహసీల్దార్ కార్యాలయ అధికారులు మరలా పూర్వపు పద్ధతిలోనే ఆర్డీవో కార్యాలయానికి సిఫార్సు చేస్తున్నారన్నారు. జీవోను అమలు చేయకుండా రెవెన్యూ అధికారులు తమ జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విచారించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఆయనతో పాటు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ పల్నాడు జిల్లా కో ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప ఉన్నారు.

- సీసీఐ కేంద్రం ఏర్పాటులో నిర్లక్ష్యం
- అయినకాడికి పత్తి అమ్ముకుంటున్న రైతులు
- గత ప్రభుత్వంలో సకాలంలో కొలుగోలు కేంద్రాలు
- పంటకు మద్దతు ధరతో పాటు నడికుడి యార్డుకు ఆదాయం
- ప్రస్తుతం కోత దశలో ఉన్న పత్తి పంట

పత్తి రైతు చిత్తు..



నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయం

దాచేపల్లి: ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి పంటను విక్రయించేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కనీస గిట్టుబాటు ధర లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇదే అదునుగా దళారులు రైతన్నలను నిలువున దొచుకుంటు నామ మాత్రపు ధర చెల్లిస్తున్నారు. దీంతో రైతుల పట్ల కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనిపిస్తోంది. పత్తి పంట కోతకు వచ్చినా.. ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం సీసీఐ(పత్తి కొనుగోలు కేంద్రం) ఏర్పాటు చేయకపోవడం ఇందుకు నిదర్శనం. అద్దంకి - నార్కెట్ పల్లి హైవే అనుకుని ఉన్న నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఇప్పటి వరకు సీసీఐ కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సీసీఐ కేంద్రం ఏర్పాటు చేస్తే పత్తి పంటకు మద్దతు ధర లభించే అవకాశం ఉన్నది.

సీసీఐ కేంద్రం ఏర్పాటుపై జాప్యం..

సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల రైతులు తెచ్చే పంటకు మద్దతు ధర లభిస్తుంది. నగదు సకాలంలో సంబంధిత రైతు బ్యాంక్ ఖాతాలో జమ అవుతుంది. గత ప్రభుత్వంలో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరింది. గురజాల నియోజకవర్గం పరిధిలోని దాచేపల్లి, గురజాల, మాచవరంతో పాటుగా సమీపంలోని తెలంగాణ నుంచి కూడా రైతులు పత్తి పంటను నడికుడి యార్డుకు తీసుకు



యార్డులో అన్ని వసతులతో నిర్మించిన భారీ గోడౌన్స్

వచ్చి విక్రయిస్తారు. సకాలంలో పంటను అమ్ముకోవడంతో పాటుగా యార్డుకి కూడా ఆదాయం సమకురుతుంది. సీసీఐ కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉంది. ఈ ఏడాది మండల వ్యాప్తంగా 753 హెక్టార్లలో పత్తి పంటను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం పత్తి తీస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఠంఛన్‌గా..

గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో సీసీఐ కేంద్రాన్ని క్రమం తప్పకుండా సకాలంలో ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని నడికుడి, పిడుగురాళ్లలో సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయించడంతో రైతులకు ప్రయోజనం చేకూరింది.

ఆర్థికంగా నష్టపోతున్న రైతులు..

ప్రస్తుతం నాణ్యమైన పత్తి ఉన్నప్పటికీ నాసిరకం, పలు కారణాలు చెప్పి క్వింటా రూ.5 వేల నుంచి రూ.5,500 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీని వల్ల రైతులు భారీగా నష్టపోతున్నారు. పత్తి తీసిన కూలీలకు కూలి డబ్బులు చెల్లించడం కోసం, పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులను తీర్చడం కోసం రైతులు తక్కువ ధరకు పత్తిని విక్రయిస్తున్నారు. సీసీఐ కేంద్రం ఏర్పాటు చేస్తే పత్తి నాణ్యతను బట్టి ధర లభించడం వల్ల రైతులకు లబ్ధి చేకూరుతోంది.

సీసీఐ కేంద్రం ఏర్పాటు చేస్తాం

నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డులో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేస్తాం. దీనిపై ప్రభుత్వానికి స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ద్వారా ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే సీసీఐ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. రైతులు పండించిన పంటకు మంచి మద్దతు ధర కూడా సీసీఐ ద్వారా లభిస్తుంది. ఇప్పటికే పిడుగురాళ్లలో సీసీఐ ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులో తెచ్చాం.

– శ్రీనివాసరావు, యార్డు కార్యదర్శి

గత మూడేళ్లలో యార్డులో పత్తి కొనుగోలు వివరాలు

సంవత్సరం	రైతులు	క్వింటాళ్లు	విలువ	యార్డు ఆదాయం(రూ.ల్లో)
2020-21	4,708	1,61,498	83,93,80,116	1,61,498
2021-22	2,357	1,06,387	61,27,89,963	61,27,899
2023-24	2,226	52,532	36,31,54,537	36,31,545

సుబ్రహ్మణ్యస్వామికి పల్లకి సేవ



పిడుగురాళ్ల: పట్టణంలోని నాగుల గుడి నుంచి ప్రారంభమైన సుబ్రహ్మణ్య స్వామి పల్లకి సేవ పట్టణ వీధుల్లో గురువారం అంగరంగ వైభవంగా కొనసాగింది. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు. భక్తులు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పల్లకీ మోస్తూ ముందుకు కదిలారు. అనంతం స్వామివారి తీర్థప్రసాదాలను ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు.

మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు



రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద వేంచేసిన అతి పురాతనమైన శైవక్షేత్రమైన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానం నందు కార్తీకమాసం సందర్భంగా అనేక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి గురువారం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు చిట్టేల శివశర్మ నేతృత్వంలో మల్లిఖార్జున స్వామివారికి, భ్రమరాంభికాదేవి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు, హోమములలో నిర్వహించారు. గోగుల పద్మావతి, వెంకట్రామిరెడ్డి, నాగలక్ష్మి, ఎస్. వెంకటరెడ్డి, గౌతమి భక్తులకు, వివిధ స్వామి మాలలు స్వీకరించిన మాల దారులకు అన్నదానం చేయగా ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎలుకల నివారణతోనే అధిక దిగుబడులు సాధ్యం



ఏఓ బోయపాటి బ్రహ్మారెడ్డి

రెంటచింతల: రైతులందరూ సామూహిక ఎలుకల నివారణ చర్యలు చేపట్టడం ద్వారానే అధిక దిగుబడులను సాధించవచ్చని ఏఓ బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వరి సాగు చేస్తున్న రైతులు సామూహిక ఎలుకల నివారణ చర్యలను చేపట్టాలన్నారు. దీనిలో భాగంగా వీఏఏలు, వీహెచ్ఏలు సూచనల మేరకు విషపు ఎర(మందు)ను రైతులు తయారు చేసుకోవాలన్నారు. ఎలుకలు తినే దానికన్నా 7 నుంచి 8 రెట్లు ధాన్యాన్ని నష్ట పరుస్తాయన్నారు. రైతులందరూ ఒకే రోజు ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టడం ద్వారా కొంతమేర నష్టాన్ని తగ్గించుకోవచ్చన్నారు. వరిపైరు 4 నుంచి 6 వారాల మధ్య ఎలుక రోజుకు 100 మొక్కలను కొరికి నాశనం చేస్తుందన్నారు. ఎలుకల నివారణకు రాష్ట్రప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా బ్రోయోడయోలిన్ అనే మందును 100 శాతం రాయితీపై అందచేస్తుందన్నారు. రెండు గ్రాముల బ్రోయోడయోలిన్ మందును, 96 గ్రాముల నూకలు, రెండు గ్రాముల వంటనూనెను కలిపి 100గ్రాముల విషపుఎరను తయారుచేసుకోవచ్చన్నారు.ఒక్కొక్క ఎలుక బొరియలో 10 గ్రాముల విషపుఎరను పొట్లాలు కట్టి వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

జీవన ఎరువుల యాజమాన్యం ఎంతో మేలు



మాట్లాడుతున్న జిల్లా వనరులు కేంద్రం వ్యవసాయ అధికారి ప్రవీణ్

మాచవరం: పంటల సాగు విధానంలో రసాయన ఎరువులకు బదులు జీవన ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఎంతో మేలని జిల్లా వనరులు కేంద్రం వ్యవసాయ అధికారి ప్రవీణ్ అన్నారు. మండలంలోని కొత్త గణేశునిపాడులో గ్రామ రైతు పొందూరు నరసింహారావు సమగ్ర వ్యవసాయ క్షేత్రంలో సబ్ డివిజనల్ స్థాయి వ్యవసాయ శాఖ సిబ్బందికి గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు, మందులు అధికంగా వాడడం వల్ల భూసారం, పర్యావరణం దెబ్బతింటుందన్నారు. వ్యవసాయం, గొర్రెలు, చేపల, కోళ్ల పెంపకం, పండ్ల తోటల సాగు, పశుపోషణపై రైతులకు కలిగే ఆర్థి వనరులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు, ఏవోలు కె.రామమ్మ, డి.పాపకుమారి, ఎస్.శ్రీనివాసరెడ్డి, మాచవరం, పిడుగురాళ్ల, నకరికల్లు, కారంపూడి, దాచేపల్లి మండలాల వ్యవసాయ శాఖ సిబ్బంది, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అధికారులు

రెంటచింతల: క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు అంకితభావంతో విధులు నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి వి. శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి వివిధ శాఖాధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి స్కిల్ సెన్సెస్ అండ్ హౌస్ హోల్డ్ జియో లోకేషన్ క్యాప్చర్‌పై నిర్వహించిన శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో పనులు చేపట్టాలని తెలిపారు. సమయ పాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం తగదన్నారు. నిర్ణీత సమయంలో చేపట్టిన పనులను ఖచ్చితంగా పూర్తిచేయాలన్నారు. అనంతరం అధికారులతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ సరోజినిదేవి, పీఆర్ఏఈ వెంకటేశ్వరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెన్ను వెంకటేష్, ఈఓపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

24న యాదవ కార్తిక సమారాధన



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యాదవ సంఘ నాయకులు

మాచర్ల కార్తీక వన సమారాధన విజయవంతం చేసేందుకు విస్తృత ప్రచారం చేయాలని యాదవ సంఘ నాయకులు కోరారు. గురువారం నాయుడు బిల్డింగ్ పక్కన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యాదవ కార్తీక వన సమారాధన ఏడో వార్షికోత్సవ మహోత్సవ పోస్టర్లు ఆవిష్కరించారు. యాదవ సంఘ జిల్లా, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ యాదవ జాతి శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రపంచ వ్యాప్తంగా ముందుకు వెళుతున్నారన్నారు. ఈ నెల 24న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు సాగర్ రోడ్డులోని ఆర్టీసీ డిపో ఎదురు నిర్వహించే వన సమారాధన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ హాజరు కావాలని సంఘ నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 96180 30603, 99081 97630, 99497 47485 నంబర్లకు సంప్రదించాలన్నారు.

నైపుణ్య గణన సర్వేపై శిక్షణ

మాచవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న నైపుణ్య గణన సర్వే పట్ల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో 15 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారిని గుర్తించి, వారి ఆకాంక్షలను నెరవేర్చేందుకు చేపట్టే కార్యక్రమాలపై సర్వే నిర్వహించాల్సి ఉంటుందని తెలియజేశారు. మొబైల్ యాప్ అప్లికేషన్ వినియోగాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంగళరావు, ఎంఈఓ ప్రసాద్, శిక్షణ అధికారి షేక్ షరీఫ్, స్కిల్ సెషన్స్ కో–ఆర్డినేటర్ శ్రీకాంత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శిశు మరణాలు తగ్గించాలి



గురజాల : నవజాత శిశు మరణాలను తగ్గించాలని సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నందు గురువారం నవజాత శిశు సంరక్షణ దినోత్సవం పురస్కరించుకుని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, నాలుగోవ అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్‌బాబు ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టం, పీసీపీ ఎన్‌డీటీ చట్టం గురించి వివరించారు. మొదటి రెండేళ్ల పిల్లల పెంపకం కీలకమన్నారు. వ్యాక్సిన్‌ను అందించడంలో కూడా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది షేక్ జానీ బాషా, వైద్యులు డాక్టర్ హసీనా, సాయి కర్ణకుమార్, వి.సుధీర్, వాసు, ఏడుకొండలు, జాఫ్రీన్, సురేష్, హెడ్‌నర్సు జయ తదితరులున్నారు.

నైపుణ్య గణన సర్వేపై శిక్షణ

మాచర్ల నైపుణ్య గణన సర్వే నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు శిక్షణ తరగతులు జరిగాయి. కో–ఆర్డినేటర్ కిరణ్ స్కిల్ స్పెన్సెస్, యాప్‌కు సంబంధించిన అన్ని వివరాలు తెలిపారు. మొబైల్ అప్లికేషన్‌పై అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబంలో 15 నుంచి 59 సంవత్సరాల వయస్సు వారు, నిరుద్యోగుల వివరాలు సేకరించాలన్నారు. సర్వేలో ఎక్కడా రాజీ పడకుండా ప్రతి వార్డు తిరిగి వివరాలు సేకరించి, యాప్‌లో నమోదు చేయాలని సచివాలయ ఉద్యోగులకు సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయన్నారు. 20 రోజుల్లో సర్వేను పూర్తి చేయాలన్నారు. పురపాలక సంఘ టౌన్ ప్లానింగ్ అధికారి నాగేశ్వరరావు, ఏఈ గౌతమి, సచివాలయ అడ్మిన్లు, ఉద్యోగులు, పురపాలక సంఘ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'బాల బాట'ను సద్వినియోగం చేసుకోండి

గురజాల: గ్రామాల్లో ఏర్పాటు చేసిన బాలబాట పాఠశాలలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ అమర్నాథ్ సూచించారు. స్థానిక విశ్రాంతి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఒక్క విద్యార్థి మధ్యలో చదువును ఆపకూడదనే లక్ష్యంతో ఈ బాలబాట కార్యక్రమం తలపెట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్డ్స్ సంస్థ ఏరియా కో–ఆర్డినేటర్ పి.దయామని తదితరులున్నారు.

సీవీ రామన్ ఆదర్శం



నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ మోహన్

రెంటచింతల: సైన్స్‌లో ప్రయోగాలు చేసి దేశ ప్రతిష్టను పెంచి, నోబెల్ బహుమతిని పొందిన తొలి భారతీయుడిగా పేరుగాంచిన మహాజ్ఞాని సీవీ రామన్‌ను విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎస్. మోహన్ అన్నారు. గురువారం డాక్టర్ సీవీ రామన్ 136వ జయంతిని, బిపిన్ చంద్రపాల్ 166వ జయంతిని, ఆచార్య ఎన్‌జీ రంగా 124 వ జయంతిని పురష్కరించుకుని పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షుడు నారాయణపురం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులతో కలిసి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాగ్యమేరి, కె. వెంకటనారాయణమ్మ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



శ్యాంపిల్స్ సేకరిస్తున్న అడిషనల్ డైరెక్టర్ వీర్రాజు

దాచేపల్లి: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గుంటూరు జోనల్ మలేరియా కార్యాలయం అడిషనల్ డైరెక్టర్ డి.వీర్రాజు అన్నారు. మండలంలోని పొందుగల గ్రామంలో ఆయన గురువారం పర్యటించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి గ్రామ ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పలు చోట్ల తాగునీటి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా అవగాహన కల్పించాలని, ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంచాలని సిబ్బందికి సూచించారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గురువారం క్యాన్సర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ఇమ్మడిశెట్టి అమూల్య ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది నగర పంచాయతీ పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించారు. క్యాన్సర్ రాకుండా, క్యాన్సర్ బారిన పడిన బాధితులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్య సేవలను వివరించారు. డాక్టర్ మధు, పట్టాభి పాల్గొన్నారు.

'ప్రజా పోరు' కరపత్రాల ఆవిష్కరణ



కర పత్రాలను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

పిడుగురాళ్ల: సీపీఎం ప్రజాపోరు ప్రచార యాత్ర కరపత్రాలను పార్టీ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ నెల 8 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న యాత్ర నిర్రవహించనున్నట్లు సీపీఎం మండల కన్వీనర్ తెలకపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తామని, కరెంటు చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి నేడు కూటమి ప్రభుత్వం విస్మరిస్తోందని ఆయన ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజు రోజుకు ఆకాశాన్ని అంటుతున్నాయని, సామాన్యుడు కొనే పరిస్థితిలో లేవన్నారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుముఖం పట్టినప్పటికి, పెట్రోల్, డీజిల్ ధరలు మాత్రం భగ్గుమంటున్నాయన్నారు. విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం వేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. చౌక ధరల డిపోల ద్వారా ప్రజలకు 19 రకాల నిత్యావసర వస్తువులను సరఫరా చేయాలని, విద్యుత్ చార్జీలను వెనక్కి తీసుకోవాలని జరిగే సీపీఎం ప్రజా పోరు ప్రచార యాత్రలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. 14న మండల కేంద్రాల్లో ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంపత్ వెంకట కృష్ణ, తుమ్మల వెంకయ్య, అంకారావు, వెంకటేశ్వర్లు, సైదులు, లక్ష్మయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రారంభంలో క్యాన్సర్‌ను గుర్తిస్తే మేలు



ర్యాలీ నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, డాక్టర్ రమాదేవి

రెంటచింతల: క్యాన్సర్ వ్యాధిని ప్రారంభంలో గుర్తించినట్లు అయితే ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చునని స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి అన్నారు. గురువారం వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా డాక్టర్ రమాదేవి, పీహెచ్‌సీ సిబ్బంది కలిసి ప్రజలలో అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు క్యాన్సర్‌పై ఉన్న అపోహలను ముందుగా తొలిగించుకోవాలన్నారు. మండలంలో ఈ నెల 14 నుంచి ప్రతి గ్రామంలో క్యాంపులు ఏర్పాటు చేసి ఉచితంగా క్యాన్సర్ వ్యాధి నిర్ధాన పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ఎస్.కోటేశ్వరరావు, ఎంపీహెచ్ఈఓలు ఏడీ శర్మ, ఎ.ఆంజనేయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం

పిడుగురాళ్ల రూరల్: మండలంలోని కామేపల్లి గ్రామం నందు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ సందర్భంగా అవగాహన కార్యక్రమాని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ... క్యాన్సర్ ఎన్ని రకాలు, వాటిని ఎలా గుర్తించాలి, ఎలా నివారించాలి అని ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాయి, ఏఎన్ఎం కృష్ణకుమారి, దుర్బేష, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.